క్లుప్తంగా

విజయ్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం పరిశోధకుడు ఎం.విజయ్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అప్టమైజేషన్ ఆఫ్ ప్రొటీన్ ఎనర్జీ లైసిన్ అండ్ మెథైనిన్ రిక్వైర్‌మెంట్ ఫర్ బ్రాయిలర్స్ రేర్డ్ అండర్ ఓపెన్ సైడెడ్ హౌసింగ్ సిస్టమ్ ఇన్ హాట్ అండ్ కోల్డ్ వెథర్ కండిషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ పర్యవేక్షణలో విజయ్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. విజయ్‌కుమార్ ప్రస్తుతం వరంగల్ ఎల్‌బీ కళాశాలలోని ఫౌల్ట్రీ విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ప్రత్యేక సేవలకు తరలిరావాలి

చిల్పూరు: ఈనెల 28వ తేదీ (మంగళవారం)న శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ప్రత్యేక సేవలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు కోరారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ఆదివారం వారు మాట్లాడారు. ఆలయంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పంచామృత, వివిధ ఫలపుష్పాలతో అభిషేక సేవ, 7 నుంచి 9 వరకు చందనోత్సవం, అలంకార సేవ, 9 నుంచి 9.45 వరకు ఆరగింపు, నక్షత్ర హారతి, 10 నుంచి 10.45 వరకు అష్టదళ పాద పద్మారాధనసేవ, 11 నుంచి 12.30 శ్రీవారి కల్యాణం, 12.30 నుంచి 1.30 గంటల వరకు ఆరగింపు ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వారు తెలిపారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, రత్నాకర్‌రెడ్డి, కుంచాల సంపత్ రాజు, జయప్రకాష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన పాస్టర్ గంధమాల ఆనందం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా ఘన్‌పూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు కొలిపాక వేణు తల్లి అహల్య కొద్ది రోజుల క్రితం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కాల్పోయిన చెందిన సాంబారి శ్రీనివాస్‌ను స్టేషన్‌ఘన్‌పూర్‌లో పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, నీల గట్టయ్య, కొలిపాక సతీష్, దుంపల పద్మారెడ్డి, కుమారస్వామి,అంబటి కిషన్‌రాజు, గట్టు కోటి, పొన్నం నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం



తరిగొప్పుల: పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రి చేరుకున్న సిబ్బందితో అధికారులు



స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల అధికారులతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు



పాలకుర్తి: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు, సిబ్బంది



రఘునాథపల్లి: సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్

తరిగొప్పుల: నేడు(సోమవారం) జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. స్థానిక ప్రభుత్వ బాలబాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి పోలీసుల బందోబస్తు నడుమ ఎన్నికల సామగ్రి చేరుకుంది. మండల పరిధిలో 558 పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తహసీల్దార్ కిష్టయ్య, గిర్దావర్ రవీందర్, కానిస్టేబుల్ గాలీబ్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి

జఫర్‌గఢ్: పట్టభద్రుల స్థానానికి జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో అదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు 1,524 ఉన్నాయని, పోలింగ్‌కు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బంది

రఘునాథపల్లి: ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని 19, 20 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలీసులు, సిబ్బందికి తహసీల్దార్ పురం యుగేందర్ పలు సూచనలు చేశారు. రెండు బూత్‌ల్లో 1,821 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా నేడు(సోమవారం) పోలింగ్ నిర్వహించే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్, ఎస్సై ముత్యం రాజేందర్‌తో కలిసి అధికారులు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండలంలోని 2,504 మంది పట్టభద్రులు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓట్లు వేసేందుకు పాలకుర్తి హైస్కూల్‌లో 27, 28,29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ వెంకటేశం తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్సై ప్రసన్న కుమార్, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: నేడు నిర్వహించనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్ పోలింగ్ కేంద్రానికి ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గాను ఘన్‌పూర్ మండలంలో 2,027 ఓట్లు ఉన్నాయని, స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఉంటుందని, అందులో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సామగ్రి, సిబ్బంది, ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారన్నారు. ఎస్సై నాగరాజు, ఎంపీడీఓ, ఉమాదేవితోపాటు తదితరులు ఉన్నారు.



జఫర్‌గఢ్‌లో..

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలో నేడు(సోమవారం) జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో సిబ్బంది బ్యాలెట్ పేపర్లతో ఆదివారం సాయంత్రం మండల కేంద్రానికి చేరుకున్నారని ఎంపీడీఓ రఘురామకృష్ణ, తహసీల్దార్ విశాలాక్షిలు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎస్సై కంకల సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట: మండలంలో నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది బ్యాలెట్ పేపర్లతో మండల కేంద్రానికి చేరుకున్నారని తహసీల్దార్ మహిపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీఐ వెంకటరమణ, ఎస్సై శ్రీకాంత్, ఆర్‌ఐ సాయిబాబ పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది ఉన్నారు.

కామారెడ్డిగూడెంలో..

దేవరుప్పుల: మండంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో నేడు జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు ఆదివారం సాయంత్రం సర్వం సిద్ధం చేశారు. ఈ కేంద్రంలోని 30,31 పోలింగ్ కేంద్రాల్లో 1,868 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై ఎన్.చెన్నకేశవులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు పెట్టారు. ఎన్నికల సెక్టార్ అధికారి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఉన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఆదివారం అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. మండలంలో 1,677 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా సీఐ శ్రీనివాస్‌యాదవ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలీసులకు తగిన సూచనలు చేశారు. సీఐతో పాటు ఎస్సై చింత రాజు, ఏఎస్సై అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

‘శ్రీపతిపల్లి’ శ్రీమంతుడు

- గ్రామసేవలో రాజు దంపతులు



ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రాజు-స్రవంతి (ఫైల్)

చిల్పూరు : పుట్టిన ఊరుకు సేవ చేయాలని తలంపుతో మాలోత్ రాజు-స్రవంతి దంపతులు కంకణం కట్టుకున్నారు. మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన రాజు ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్ ఫౌండర్‌గా పని చేస్తున్నారు. అయితే ఇక నుంచి గ్రామస్తులకు సేవ చేయాలనే తపనతో భార్య స్రవంతి, కుమారుడు జ్ఞానేశ్వర్, కుమార్తె పూజిత, మిత్రులతో కలిసి గ్రామంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని 62 మందిని గుర్తించి వారందరికి రూ.2.78 లక్షలు వెచ్చించి లైసెన్స్‌లు ఇప్పించాడు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల కోసం చలువ పందిళ్లు వేయించారు. గ్రామ సమీపంలోని పొటిమీద ఉన్న హనుమాన్ ఆలయానికి భక్తులు వచ్చి పోతుంటారు. అక్కడ రూ.8 లక్షలతో ప్రహరీ, రూ. 3.50 లక్షలతో తాగు నీటి సౌకర్యం కల్పించారు. హనుమాన్ మాలధారణ భక్తులకు 41 రోజులు అన్నప్రసాద వితరణ చేపట్టాడు. రాజకీయంగా అవకాశం వస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానంటున్నాడు రాజు.

నివాళి

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన గట్టగల్ల కరుణాకర్ అనే డిగ్రీ విద్యార్థి మండలంలోని పటేల్‌గూడెంలో ఈ నెల 24న కూలి పనికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా ఆదివారం ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకొని కరుణాకర్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు వీరయ్య, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సన్మానిస్తున్న కురుమసంఘం పెద్దలు



బచ్చన్నపేట: పూజలో పాల్గొన్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి గ్రామంలో బీరప్పస్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం సందర్శించి స్వామివారికి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. శివునిపల్లిలో కురుమ కులస్తుల ఆరాధ్యదైవమైన బీరప్పస్వామి ఆయంలో ఈనెల 24 నుంచి బీరప్పస్వామి, కామరాతి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. కాగా, ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరు కాగా కురుమసంఘం పెద్దలు, ఒగ్గు కళాకారులు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. గుడి వద్ద వేసిన పట్నాలను సందర్శించి బీరప్ప-కామరాతి కల్యాణ ఉత్సవాలను తిలకించారు. సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు మేకల మల్లేశం, కురుమ కులపెద్దలు బండారి అయ్యాలు, పెద్ది వెంకటయ్య, ఉడుత రాజశేఖర్, గుంటి శ్యామ్, మీస కృష్ణ, పారం లింగయ్య, బండారి శంకర్, మీస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో..

బచ్చన్నపేట: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో దుర్గామాత ఆలయంలో పలువురు నాయకులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు బోనాలు చేసి సమర్పించారు. మాజీ సర్పంచ్ నూకల నవ్యానర్సిరెడ్డి, వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ నూకల భాస్కర్‌రెడ్డి, ఆముదాల భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు అలంకారప్రాయం

- గ్రామాల్లో పని చేయని సీసీ కెమెరాలు
- నిధుల కొరతతో నిర్వహణ కొరవడిన పంచాయతీలు
- లక్షలాది రూపాయల ప్రజా ధనం వృథా



నెల్లుట్ల గ్రామ పంచాయతీ భవనం



నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

లింగాలఘణపురం: గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను పట్టుకోవడం కోసం ఒక్క నిఘా నేత్రం వంద మందితో సమానమంటూ పోలీసులు పదే పదే చెబుతూ ఆయా గ్రామాల్లో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. మండలంలోని 21 పంచాయతీల్లో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. కానీ అవి ప్రస్తుతం అలంకార ప్రాయంగానే మిగిలి ఉన్నాయి. మండలంలో ఒక్కొక్క గ్రామంలో ఆయా గ్రామాల జనాభా, విస్తీర్ణం బట్టి నాలుగు నుంచి ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ అయిన ఒక్క నెల్లుట్ల గ్రామంలోనే 34 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం ఊరంతా నిఘానిడలోనే ఉండే విధంగా చూశారు. నెల్లుట్లలో 34 కెమెరాలకు సుమారుగా రూ.4 లక్షలు ఖర్చు చేశారు. ఇలా మండలంలో సుమారు వందకుపైగా ఉన్న సీసీ కెమెరాల ఏర్పాటుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. ఇలా లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అవి పని చేయకుండా పోవడం, నిర్వహణ లేకపోవడంతో వృథా అవుతున్నాయి. ఇలా ఒక్కొక్క పంచాయతీలో నాలుగైదు సార్లు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి లక్షల రూపాయలు నిరుపయోగం చేస్తున్నారు. వాటి నిర్వహణ విషయంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో పంచాయతీలకు భారంగా మారింది. దీంతో నిధుల లేమితో కొట్టు మిట్టాడుతున్న పంచాయతీలు వాటిని వదిలేశాయి. గ్రామాల్లో ఏమైనా నేరాలు జరిగితే పోలీసులకు సహకారంగా ఉండే సీసీ కెమెరాలు ప్రస్తుతం పని చేయడంలేదు. జనగామ-సూర్యాపేట ప్రధాన రోడ్డులో ఉండే నెల్లుట్ల, నవాబుపేట, వడిచర్ల, వనపర్తి స్టేజీల వద్ద సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రధాన రోడ్డుపై ఉన్న గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగితే నేరస్తులను పట్టుకొనేందుకు ఎంతో అవకాశం ఉంటుంది.

22 నెలలుగా నిధులు లేవు



గ్రామ పంచాయతీలకు గత 22 నెలలుగా అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడంలేదు. దీంతో నిర్వహణ ఇబ్బందిగా ఉంది. ఇటీవల సీసీ కెమెరా మరమ్మతుకే కాదు.. సిబ్బంది వేతనాలు, ఇతర నిర్వహణ కూడా కష్టంగానే ఉంది. సీసీ కెమెరాలకు సుమారు రూ.50వేల నుంచి రూ.60వేల ఖర్చు అవుతుంది. నిధులు రాగానే మరమ్మతులు చేస్తాం.

- ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, నెల్లుట్ల

హనుమాన్ మాలధారుల నగర సంకీర్తన

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం గ్రామంలో హనుమాన్ మాలధారులు నగర సంకీర్తనలో పాల్గొన్నారు. శనివారం మాలధారులు హనుమాన్ దేవాలయం నుంచి దేవుడి చిత్రపటంతో భజన చేస్తూ పురవీధుల్లో తిరిగారు. మాలధారులకు సుంకోజు రజిత, కృష్ణమూర్తి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు సురేష్, భరత్, పరమేష్, దిలీప్, శరత్, బాబు, భాస్కర్, సాయిబాబ పాల్గొన్నారు.



నగరసంకీర్తనలో హనుమాన్ మాలధారులు

మచ్చుపహాడ్‌లో పూజలు

నర్మెట: మండలంలోని మచ్చుపహాడ్‌లో హనుమాన్ మాలధారులు ఆలయంలో గురుస్వామి కోనేటి మల్లేశం ఆధ్వర్యంలో ఆదివారం యజ్ఞం, హోమం చేశారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. స్వాములు శివస్వామి, పోలు రాజు, భాస్కర్, సారయ్య, పాల్గొన్నారు.



నర్మెట: హోమంలో పాల్గొన్న మాలధారులు

పాఠశాలల్లో అభివృద్ధి పనులు ముమ్మరం



పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



పూర్తయిన మరుగుదొడ్లు

చిల్పూరు: మండలంలోని 21 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికయ్యాయి. కాగా, అధికారులు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తీర్చేందుకు పనులు ముమ్మరంగా చేపట్టారు. ఎంపికైన 21 పాఠశాలల్లో తాగు నీరు (21 పాఠశాలలు), విద్యుత్ సౌకర్యం(10), మరుగుదొడ్లు(21), మైనర్ మర్మతులు (09) పాఠశాలల్లో మొత్తం 61 అంశాలకు రూ. 67.66 లక్షలు మంజూరయ్యాయి. అందులో మొదటి విడతగా రూ. 16.92 లక్షలు విడుదల చేశారు. గతంలో పాఠశాలల్లో సౌకర్యాలు లేక ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు సమస్యలను ఎదుర్కొనే వారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం సౌకర్యాల లేమితో ఉన్న పాఠశాలలను మొదట గుర్తించి పనులు చేపట్టారు. ఇట్టి పనులను ప్రతీ రోజు మండల నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ పరిశీలిస్తుండగా జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

పాఠశాలలు తెరిచేలోగా పనులు పూర్తి చేస్తాం..



మండలంలో 21 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికయ్యాయి. ప్రస్తుతం ఐదు పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యాయి. జూన్ 10వ తేదీ వరకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- దాసరి గోవర్ధన్, నోడల్ అధికారి

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రఘునాథపల్లి: సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు



బచ్చన్నపేట: కొన్నెలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 35 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1989-90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల వేదికగా కలుసుకున్నారు. చిన్నతనంలో చేసిన చిలిపిపనులను గుర్తుకు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

నిడిగొండలో..

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1994-95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ఆనాటి బాల్య స్నేహితులు మళ్లీ కలుసుకున్నారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువు ఖాజాహుసేన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యుల వివరాలు చెబుతూ పరిచయ కార్యక్రమం చేపట్టారు. యాదగిరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు భాగ్యలక్ష్మి, శ్రీనివాసులు, యాకుబ్‌అలీ, చంద్రశేఖర్, నాగరాజు, రమేష్, రవి, శ్రీనివాస్, అబ్బాష్, శ్రీకర్, విక్రం, ఉప్పలయ్య, కర్ణాకర్, రాజయ్య, సత్యనారాయణ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

చిన్నపెండ్యాలలో..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. హెచ్‌ఎం సంపత్, నారాయణగిరి రాజు, దారం సతీష్, భూక్య శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిల్పూరు: చిన్నపెండ్యాలలో..

కొన్నెలో..

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 2000-2001 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమేశనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు చెప్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గురువులు సిద్దిరాములు, ఏకనాథం, నర్సయ్య, చంద్రయ్య, రమేష్, బాలకిషన్, పృథ్వీరాజ్, సదానందం, శ్రీనివాస్‌రెడ్డి, వీరాంజని, అటెండర్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా



బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో కొందరు చెట్లను నరికి వేస్తూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో చెట్లను నరికి యథేచ్ఛగా కలపను తరలిస్తున్నారు. మండలంలోని పోచన్నపేట, నక్కవానిగూడెం, సదాశివపేట, కాశీ నగర్ పలు గ్రామాల్లో ఫిరంగి తుమ్మ చెట్లను నరికి బొగ్గు తయారీకి కలపను తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ఓ వ్యాపారికి ఆ చెట్లను విక్రయిస్తున్నారు. చెట్లు నరికి మొదళ్లను సైతం తీసి అట్టి భూమిని చదును చేస్తామనే అగ్రిమెంట్‌తో అన్నదాతలు ఫిరంగి తుమ్మలను అమ్ముకుంటున్నారు. ఇక్కడి నుంచి వేరే జిల్లాకు ఈ కలపను తరలిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో కూడా చెట్లను నరుకుతున్నారని, సంబంధిత అధికారులు చెట్ల నరికివేతను అరికట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.